


**మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం**

RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 251 బుధవారం 25 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# హైడ్రా కూల్చివేతల్లో సామాన్యులే సమిథలు

**సిఎం సోదరుడికి మాత్రం మినహాయింపులు**

**కోర్టు నుంచి స్టే తెచ్చుకునేలా వెసులుబాటు**

**ఇంటింటికి వెళ్ళి కండువాలు కప్పి చేర్చుకోలేదా**

**ఎమ్మెల్యే గాంధీని మావాడు అంటూ ఇంకా బుకాయింపులా**

**పార్టీ సమావేశంలో మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**



హైదరాబాద్: సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): హైడ్రా అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి టార్గెట్‌గా చేసుకుని కేటీఆర్ కామెంట్స్ చేశారు. వారికి కోర్టుకు వెళ్లేలాగా పరిస్థితి కల్పించి సామాన్యుల ఇళ్లు మాత్రం కూల్చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌కేజీ చదివే వేదశ్రీకి తన పుస్తకాలు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదు.. 50 ఏళ్ళ కస్తూరి బాయి తన జీవనాధారమైన చెప్పుల దుకాణం కోల్పోయింది.. 72 గంటల క్రితం కొన్న ఇల్లు నేల మట్టమైంది.. వారం ముందు గృహప్రవేశం చేసుకున్న ఇల్లు, అన్ని కాగితాలు ఉన్నా .. పేక మేడలా కూల్చివేయబడింది.. తిరుపతి రెడ్డి గారు.. క్షణం కూడా సమయం ఇచ్చే ప్రసక్తే లేదన్న హైడ్రా.. మీ విషయంలో నోరు మెదపలేదు..మిగతాది 2లో...

# 'మూసీ' నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు!



**మూసీ రివర్‌ఫ్రంట్‌పై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

**చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నివసిస్తున్న అర్హులైన పేదలకూ కేటాయింపు**

**జల వనరుల పరిరక్షణ చర్యల్లో పేదలు రోడ్డున పడొద్దు**

**వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపాలి**

**ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురవకుండా గట్టి పర్యవేక్షణ**

**సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలని ఆదేశం**

**శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోరైల్ విస్తరణ**



హైదరాబాద్‌సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా అక్కడ ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించిన క్రమంలో నిర్వాసిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మూసీ పరీవాహక ప్రాంతంలో పదివేల కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సంఖ్య మరింతగా ఉంటుందని.. సుమారు 16 వేల కుటుంబాలుండొచ్చని అంచనా వేస్తున్నారు. వీళ్లందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలన్న సీఎం ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, అధికారుల బృందం బుధవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. తొలి విడతలో రివర్ బెడ్‌లోని 1600 ఇళ్లను తొలగించే ప్రక్రియ వెంటనే మొదలవుతుందని చెప్పారు. తర్వాత బఫర్ జోన్‌లోని నిర్మాణాలను తొలగిస్తామన్నారు. కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించే పేదల ఇళ్లతో పాటు చెరువులు, నాలాల వద్ద ఉంటున్న పేద కుటుంబాల వివరాలను కూడా సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ భరోసా కల్పించే ప్రయత్నం చేయాలన్నారు. ఒక్క పేద కుటుంబం కూడా రోడ్డున పడకూడదని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశించారు. మిగతాది 2లో...

## రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా.!



హైదరాబాద్: సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): వైసీపీకి మరో బిగ్ షాక్ తగిలింది. రాజ్యసభ సభ్యత్వానికి వైసీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు అందజేయగా,రాజీనామాను ఆమోదిస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ మంగళవారం ప్రకటించారు. ఆర్ కృష్ణయ్య స్థానం ఖాళీ అయిందంటూ రాజ్యసభ సెక్రటరీ బులిటెన్ విడుదల చేశారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడం గమనార్హం. ఇటీవలే వైసీపీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణలు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో గతంలో 11 మంది వైసీపీ తరఫున ఎంపీలు ఉండగా.. మొత్తం ముగ్గురు రాజీనామాలు చేశారు. ముగ్గురు రాజీనామా చేయడంతో వైసీపీ రాజ్యసభ ఎంపీల సంఖ్య 8కి పడిపోయింది.

# నేడు ఎంబిబిఎస్ కన్వీనర్ కోటా

**విద్యార్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల**

**కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి**




హైదరాబాద్:సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో ఎంబిబిఎస్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును బుధవారం(సెప్టెంబర్ 25) ఉదయం విడుదల చేస్తామని కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి వెల్లడించారు. గురువారం తుది మెరిట్ లిస్టును విడుదల చేస్తామని, అదే రోజు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గత సంవత్సరానికి సంబంధించిన కాలేజీ వారిగా సీట్ల కేటాయింపు వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి వెబ్ ఆప్షన్ల కోసం ముందే కాలేజీల జాబితాను సిద్ధం చేసుకుంటే, ఆప్షన్ల నమోదు ప్రక్రియ సులభం అవుతుందని వివరించారు.

# పవన్ కల్యాణ్‌కు అండగా నిలబడాలి

**కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్**

**సెక్యులరిజం వన్ వే కాదన్న పవన్ కల్యాణ్**

**సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరిక**

**జనసేనానికి అందరూ అండగా నిలబడాలన్న కేంద్ర సహాయమంత్రి**



హైదరాబాద్:సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ మద్దతుగా నిలిచారు. ఆయన నోటి నుంచి పవర్‌ఫుల్ వ్యాఖ్యలు వచ్చాయన్నారు. సెక్యులరిజం అంటే వన్ వే మాత్రమే కాదన్న జనసేనాని వ్యాఖ్యలను ఆయన ఆయన సమర్థించారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం అవసరమైతే ప్రాణాలైనా ఇస్తానని, సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై బండి సంజయ్ ఎక్స్ వేదికగా స్పందించారు.పవన్ కల్యాణ్‌కు అందరూ అండగా నిలబడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. చివరలో "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అంటూ బండి సంజయ్ రాసుకొచ్చారు.




## రైతు రుణామాఫీపై బిజెపి పోరు

**30న ఇందిరాపార్క్‌వద్ద ఒకరోజు దీక్ష**

# ఎంఎల్‌సి ఎన్నికలకు కసరత్తు




**దరఖాస్తు తుది గడువు నవంబర్ 6**

**మార్చిలో ముగియనున్న ముగ్గురు ఎంఎల్‌సిలు జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి పదవీకాలం**

హైదరాబాద్ : రాష్ట్రంలో వచ్చే ఏడాది మార్చి 29వ తేదీన ఖాళీ కానున్న మూడు ఎంఎల్‌సి స్థానాల భర్తీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిల పదవీ కాలం 2025 మార్చి 29తో పూర్తి కానుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే రాష్ట్ర ఎన్నికల సంఘం మొదలు పెట్టింది. నవంబర్ 1న కటాఫ్ (క్వాలిఫైయింగ్) డేట్‌గా పెట్టుకుని ఓటర్ల జాబితాను రూపొందించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

ఈ మేరకు మంగళవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల ఎంఎల్‌సి ఓటర్ల జాబితా తయారీకి సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సిఇఒ తెలిపారు. ప్రస్తుతం శాసనమండలిలో మెదక్, నిజామాబాద్,ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సిగా ఉన్న జీవన్‌రెడ్డి (కాంగ్రెస్), ఉపాధ్యాయ ఎంఎల్‌సిలుగా ఉన్న కూర రఘోత్తం రెడ్డి, (మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ -కరీంనగర్), అలుగుబెల్లి నర్సిరెడ్డి (వరంగల్ -ఖమ్మం-నల్లగొండ) పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29న ముగియనున్నది. ఈ తేదీ నాటికి వీరి స్థానాల్లో కొత్త ఎంఎల్‌సిలను ఎన్నుకునే ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది.




# ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

**చౌటుప్పల్ జంక్షన్ రింగు విస్తీర్ణాన్ని పెంచొద్దు**

**గతంలో కోమటిరెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి**

**హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు**

2లో.

# హైడ్రా కూల్చివేతల్లో సామాన్యులే సమిధలు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టులో స్టే సంపాదించుకున్నారు.. ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల రావణకాష్టంలో మట్టి కూడా అంటనిది బహుశా మీకు మాత్రమేనా.. బుల్‌డోజర్ల కింద నలిగిపోతున్న సామాన్యులకు ఆ కిటుకేదో చెప్పండని అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. అలాగే రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికి వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన సన్నాసి వెధవ ఎవడు..? అని శ్రీధర్ బాబును కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. చెరువు నిండితే కప్పలన్నీ వస్తాయని సామెత ఉండేది.. మనం ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం.. అధికారంలో లేం.. మీ ఎమ్మెల్యే జంపు కొట్టిండు. కానీ ఇవాళ 150 మందితో సమావేశం అనుకుంటే.. వెయ్యి మందికిపైగా వచ్చారంటే శేరిలింగంపల్లి పోరాట స్ఫూర్తికి వందనం చేస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తుంది. బరాబర్ మళ్లీ ప్రజలు బుద్ది చెబుతారు. అరికెపూడి గాంధీకి పార్టీ ఏం అన్యాయం చేసింది. ఎందుకు పోయావంటే సమాధానం లేదు. మంత్రి శ్రీధర్ బాబు అతి తెలివిగా మాట్లాడుతుండు. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్లాడుకొని మమ్మల్ని అంటున్నరని అంటుండు. నేను ఒక్కటే అడుగుతున్నా శ్రీధర్ బాబును.. అతి తెలివి ప్రదర్శిస్తున్న మంత్రి గారూ.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మావోడు కాదు.. మీ వోడు అంటున్నవ్.. కొద్దిసేపు నీవు అంటున్నది నిజమే అనుకుందాం.. మరి ఆయనకు కండువా కప్పిన సన్నాసి వెధవ ఎవరు..? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, సీనియర్ నేత కే కేశవరావు ఇంటికి వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన దౌర్భాగ్యుడు, సన్నాసి వెధవ ఎవడు..? చెప్పు శ్రీధర్ బాబు దమ్మంటే. చెప్పుకునేందుకు కొంత సిగ్గుమానం ఉండాలి అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

**చౌటుప్పల్ జంక్షన్ రింగు విస్తీర్ణాన్ని పెంచొద్దు**

**గతంలో కోమటిరెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి**

**హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు**

హైదరాబాద్:సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త):
రీజినల్ రింగు రోడ్డు (ట్రిపు ల్ ఆర్) భూ సేకరణలో నష్టపోతున్న రైతులు, బాధితులకు న్యాయం చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు.
ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. ట్రిపుల్ ఆర్‌తో నష్టపోతున్న రైతులు మంగళవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్ భరోసా ఇవ్వడంతో పాటు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 'బాధితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాక్షాత్తూ భువనగిరి సభలో ప్రియాంకాగాంధీ హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగంలో జంక్షన్‌ను 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని రైతులు నష్టపోతున్నారు.గతంలో జంక్షన్ రింగును 78 ఎ కరాల్లో ప్రతిపాదించగా, ప్రస్తుతం 184 ఎకరా లకు పెంచడంతో నష్టం పెరుగుతుంది. గతంలో ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రె డ్డి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నా చేశారు.
కానీ ఇప్పు డు పోలీసు బలగాలతో నిర్బంధంగా సర్వే చేసి ఒప్పంద పత్రాల మీద సంతకాలు చేయాలని ఒత్తిడి చేయడం దుర్మార్గం. కాంగ్రెస్ మాట నిలుపుకునేంత వరకు బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. బాధితుల పక్షాన పోరాటం చేస్తాం'అని హరీశ్‌రావు చెప్పారు

## రైతు రుణామఫీపై బిజెపి పోరు

**30న ఇందిరాపార్క్ వద్ద ఒకరోజు దీక్ష**

హైదరాబాద్‌సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో.. తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 30న రైతు హామీల సాధన కోసం దీక్ష చేపట్టాలని నిర్ణయించింది. ఈ దీక్షలో బీజేపీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొననున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర నెలలవుతున్నా
ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని బీజేపీ మండిపడుతోంది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ దాని ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేస్తోంది. కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నేతలు అంటున్నారు. రైతు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న ఇందిరాపార్కు దగ్గర 24 గంటల దీక్ష బీజేపీ చేపట్టనుంది. ఈ దీక్ష అక్టోబర్ 1న ముగియనుంది. ఈ మేరకు బిజెఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.

# 'మూసీ' నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు అర్హులైన పేదల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలని.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తుపెట్టుకోవాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో రైలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. నగరంలోని అన్ని చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలన్నారు.

**ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు తేల్చండి**

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు అన్నింటినీ గుర్తించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని.. ఆక్రమణల వివరాలన్నీ సేకరించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని సూచించారు. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా ప్రభుత్వం చేపట్టే చర్యలు ఉండాలని పేర్కొన్నారు.

**ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు**

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం ఏర్పాటు చేయాలని, దీనిపై పూర్తిస్థాయి నివేదికను రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పాతబస్తీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. దసరాలోపు మెట్రో విస్తరణపై పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలన్నారు.

**నేటి నుంచే 'మూసీ' పునరావాస ప్రక్రియ!**

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు 16 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ బెడ్ (నదీ గర్భం), బఫర్ జోన్లలో నివాసమున్న వారికి పునరావాసం కల్పించేందుకు వీటిని ఉపయోగిస్తారు. మూసీ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో.. పునరావాస ప్రక్రియను బుధవారం ప్రారంభించనున్నారు. 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. బుధవారం నుంచి రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు.. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎక్కడెక్కడ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించారో వివరించనున్నారు. తొలుత రివర్ బెడ్‌లోని 1,600 ఇళ్లను తొలగిస్తారు. వారిలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తారు. ఇక మూసీ బఫర్‌జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే సదరు నిర్మాణ ఖర్చుతోపాటు పట్టా ఉన్న భూమి విలువను పరిహారంగా చెల్లిస్తారు. డబుల్ బెడ్రూమ్ ఇంటిని కూడా కేటాయిస్తారు.

# గాంధీభవన్ కొత్త సాంప్రదాయం

- ప్రతి బుధ,శుక్రవారాల్లో కాంగ్రెస్ కార్యాలయానికి మంత్రులు
- మూడు గంటలపాటు ప్రజలతో ముఖాముఖి
- మంత్రి దామోదర రాజనరసింహాతో నేడు మొదలు
- షెడ్యూల్ ఖరారు చేసిన పిసిసి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు అమల్లోకి తీసుకొచ్చిన పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్: సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో కాంగ్రెస్ సరికొత్త సంప్రదాయానికి నాంది పలుకుతోంది. నేటి నుంచి గాంధీభవన్‌లో 'మంత్రులతో ప్రజల ముఖాముఖి' కార్యక్రమం అమల్లోకి రానుంది. వారంలో రెండు రోజులు బుధ, శుక్రవారాల్లో మూడు గంటల పాటు గాంధీభవన్‌లో మంత్రులు అందుబాటులో ఉండేటట్లు పిసిసి కార్యాచరణ సిద్ధం చేసింది. కొత్తగా నియమితులైన పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రభుత్వానికి, పార్టీకి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌ను బలోపేతం చేసే దిశలో ముందుకు వెళ్లాలని యోచిస్తున్నారు. గాంధీభవన్‌లో మంత్రులు, సిఎం, ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండేటట్లు చూడాలని కార్యకర్తలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన మహేశ్‌కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పార్టీని బలోపేతం చేసేందుకు వారంలో రెండు రోజులు మంత్రులు, రెండు వారాలకు ఒక్క రోజు సిఎం రేవంత్ రెడ్డి గాంధీ భవన్‌లో ఉండేట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. సిఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులతో కూడా చర్చించిన తర్వాత ఈ సరికొత్త సంప్రదాయానికి నాంది పలుకుతున్నట్లు పిసిసి వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పిసిసి అధ్యక్షుడు ప్రతి రోజు గాంధీభవన్‌లో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. పూర్తిస్థాయి పిసిసి అధ్యక్షుడు కావడంతో పార్టీని బలోపేతం చేయడం ఎలా? కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే దానిని ఏ విధంగా పరిష్కారం చేయాలి? తదితర అంశాలపై గాంధీ భవన్‌లో మంత్రులతో ప్రజల ముఖాముఖి కార్యక్రమం నేటి నుంచి అందుబాటులోకి వస్తుందని పిసిసి ప్రకటించింది. వారంలో ప్రతి బుధవారం, ప్రతి శుక్రవారం గాంధీభవన్‌లో ఓ మంత్రి అందుబాటులో ఉంటారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 3 గంటల పాటు మంత్రులు అందుబాటులో ఉంటారు. ఈ కార్యక్రమం నేటి నుంచి గాంధీభవన్‌లో మొదలు కానుంది. దీనివల్ల పార్టీ అధ్యక్షుడికి, మంత్రులకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే పార్టీ బలోపేతానికి కార్యాచరణ చేపట్టినట్టుగా కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**మంత్రుల షెడ్యూల్ ఖరారు**

దీనిపై వచ్చే స్పందనను దృష్టిలో ఉంచుకొని మార్పులు, చేర్పులు చేస్తారని పిసిసి వర్గాలు పేర్కొంటున్నాయి. ఆదివారం జరిగిన సీఎల్పీ సమావేశం తర్వాత సిఎంతో చర్చించిన పిసిసి అధ్యక్షుడు, గాంధీ భవన్‌లో మంత్రులు ప్రజలతో ముఖాముఖి షెడ్యూల్‌ను ఖరారు చేశారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

**మంత్రుల ముఖాముఖి షెడ్యూల్ ఇదే**

%25వ తేదీన %-% దామోదర రాజనర్సింహ
27వ తేదీన %-% శ్రీధర్ బాబు
అక్టోబర్ 04వ తేదీన %-% ఉత్తమ్ కుమార్ రెడ్డి
అక్టోబర్ 09వ తేదీన %-% పొన్నం ప్రభాకర్
అక్టోబర్ 11వ తేదీన సీతక్క
అక్టోబర్ 16-వ తేదీన %-% కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
అక్టోబర్ 18వ తేదీన కొండా సురేఖ
అక్టోబర్ 23-వ తేదీన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
అక్టోబర్ 25 -వ తేదీన జూపల్లి కృష్ణారావు
అక్టోబర్ 30వ తేదీన తుమ్మల నాగేశ్వరరావు

# వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి గార్లు వ్యవసాయ శాఖ అధికారి అనురాధ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమీక్షలో అక్టోబర్ నుండి జనవరి వరకు కాటన్ ప్రోక్యుర్మెంట్ సెంటర్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ రవీందర్ రెడ్డి, కాటన్ అసోసియేషన్ మెంబర్ వీరా రావు, డిసివో నీరజ ,జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఉన్నంత శ్రేణి కార్యదర్శి నిర్మల, డీఎం మార్క్ ఫెడ్ మహేష్ తో ఈ సంవత్సరం కాటన్, పాడి ప్రొక్యూర్మెంట్ సెంటర్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించడమైనది. రైతులకు ఈ సంవత్సరం సన్నరకం దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేయుటకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను, నియమాలను తూ.చ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ క్షేత్ర స్థాయి అధికారులు గ్రామాలలో పర్యటించి ఎంత మంది రైతులు ఏ ఏ పంటలు వేశారో ముందస్తు నివేదికలు తయారు చేయాలని, నివేదికల ఆధారంగా ఏ ఏ రకం ఎంత పంట కొనుగోలు కేంద్రాలకు చేరుతుందని ముందస్తుగా ఏర్పాటు చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నారు. గ్రామస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలలోని హార్వెస్టర్ల యజమానులతో మీటింగ్ ఏర్పాటు చేసి రైతులు పండించిన పంట పూర్తిగా కోతకు సిద్ధం అయినప్పుడు మాత్రమే హార్వెస్టర్లతో వరి కోతలను చేయించాలని, లేనిపక్షంలో తాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ఉండేందుకు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మిల్లర్లతో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఏదైనా సమస్య వచ్చినట్లు అయితే దానికి వ్యవసాయ శాఖ అధికారులు బాధ్యత వహించవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ అన్నారు. సరియైన మాయిచ్చర్ లేకుండా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చినట్లయితే సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లుగా గమనించి, అందుకు కారణమైన వారి పై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసే లారీలను ఆర్టీఏ అధికారులు ధృవీకరించిన వాహనాలను ఉపయోగించాలని, అగ్ని మాపక శాఖ అధికారులతో ముందస్తు ఏర్పాట్లు చేసి నివేదికలు పంపించాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు, మిల్లర్లకు ఏదైనా సమస్య వచ్చినట్లు అయితే వెంటనే అక్కడ ఒక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్ వీడియోను వీక్షించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): సెప్టెంబర్ 28న లోక్ అదాలత్ నిర్వహించనున్న క్రమంలో జిల్లా ప్రజలు వారి వారి సమస్యల పట్ల లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు వీలుగా జిల్లా వ్యాప్తంగా లోకల్ చానల్స్ తో పాటు సినిమా ధియేటర్ లో విస్తృత ప్రచారం చేయనున్నారు. ఇందులో భాగంగా పి.వి.ఆర్ మాల్ లోని S2 సినిమా ధియేటర్లో ప్లే అవుతున్న లోక్ అదాలత్ వీడియోను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, జిల్లా జడ్జి వి.నిర్మల గీతాంబ, డీసీపీ రవీందర్ లు స్వయంగా పరిశీలించారు. వారితో పాటు వరంగల్ తహశీల్దార్ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

# మేయర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం



- 15వ ఆర్థిక సంఘం నిధులకు కౌన్సిల్ ఆమోదం
- కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ల కు సంతాప సూచకంగా మౌనం పాటించిన కౌన్సిల్
- ప్రతిపాదిత 17ఎజెండా అంశాల్లో 16 అంశాలకు ఆమోదం తెలిపిన కౌన్సిల్
- ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి
- విద్యా వైద్యం అభివృద్ధి సంక్షేమాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి: మంత్రి కొండా సురేఖ





వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 15వ, ఆర్థిక సంఘం నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ప్రస్తుత పాలక వర్గానికి చెందిన 61వ, డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు, మాజీ కార్పొరేటర్ ఎలుగం శ్రీనివాస్ ల మృతికి సంతాప సూచకంగా కౌన్సిల్ మౌనం పాటించింది.

కౌన్సిల్ లో ప్రతిపాదిత 17ఎజెండా అంశాల్లో 16 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంత్రిగా మొదటిసారిగా కౌన్సిల్ కు హాజరైన కొండ సురేఖకు మేయర్, కమిషనర్, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బల్దియా ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా మంత్రి వర్యులు కొండా సురేఖ ప్రతిజ్ఞ( ఓత్) చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ విద్యా వైద్యం అభివృద్ధి సంక్షేమ లపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి అమలు కు కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. జిడబ్ల్యుఎంసీ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో స్టేడియంలో ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ఆమోదం నిమిత్తం పంపాలన్నారు. నగరంలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి, వరంగల్ నగరం స్వచ్ఛదనం పచ్చదనంతో పరిఢవిల్లేలా మరింత పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో వరదల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు శ్రమ ప్రశంసనీయమని, ఈ సందర్భంగా కౌన్సిల్ తరపున వారిని అభినందిస్తూ ప్రశంస పత్రాలు జారీ చేయాలని మంత్రి కోరారు. మహానగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులతో సహా అదనంగా 100 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ, కౌన్సిల్ తీర్మానించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి మంజూరుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ప్రాపర్టీ సెల్ఫ్ అసెస్మెంట్ క్రింద ఇంటి యజమానులకు 25 రెట్లు అధికంగా నమోదైన పన్నును మాఫీ చేయుటకు కౌన్సిల్లో తీర్మానించడం జరిగింది. ఓకే ఇంటికి రెండు నల్లాల పన్ను బిల్లులు వస్తున్న యజమానుల వివరాలు సేకరించి, వాటిని రద్దు చేయుటకు కౌన్సిల్లో ప్రతిపాదించాలని మంత్రి కోరారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా పై తరచుగా సమీక్షలు నిర్వహిస్తూ, భవిష్యత్తు ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. హైదరాబాద్కు ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయుటకు బహుముఖ వ్యూహాలను సీఎం అమలు చేస్తున్నారని అన్నారు.

2050 వరకు జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా వరంగల్ నగర అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ ను రూపొందిస్తున్నామని, ఫార్మా సిటి, ఐటి సర్వీసెస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఎకో టూరిజం, ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, స్టేడియం, ఎయిర్ పోర్టు, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం వంటి అంశాలు ప్రధానంగా ఉండేలా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని అన్నారు. వరంగల్ నగరం ఇన్నర్ రింగ్ రోడ్డు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపడుతున్నామని, వరంగల్ లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. నగరంలో డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, 40 ఏళ్ల పైబడిన మహిళలను గుర్తించి వారికి మల్టీ విటమిన్ మందులను పంపిణీ చేయుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించుటకు అన్ని చెరువులు కుంటలలో గుర్రపు డెక్కలు తొలగించాలన్నారు. మెప్మా విభాగంలో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ (టి ఎం సి) కే. రమేష్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని తన దృష్టికి వచ్చిందని, వెంటనే తన ప్రవర్తన మార్చుకోవాలని రమేష్ ను మంత్రి మందలించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి సభకు విచ్చేసిన అనంతరం అందరికి రాబోవు బతుకమ్మ పండుగ, విజయ దశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద మహానగరమైన వరంగల్ సమగ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, బహుముఖ వ్యూహాలను అమలు చేస్తున్నారన్నారు

వరంగల్ నగర ప్రజల చిరకాల వాంఛగా మిగిలిపోయిన భూగర్భ మురుగు నీటి పారుదల (U.G.D) వ్యవస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. గత జూన్ మాసంలో వరంగల్ పర్యటన సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులతో సమీక్షించి గ్రేటర్ వరంగల్ సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశా నిర్దేశం చేశారని, అందులో భాగంగా దేశంలోనే పేరుగాంచిన ప్రైవేట్ సంస్థతో డి.పి.ఆర్ తయారు చేయుటకు ఎంపిక చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, అండర్ గ్రౌండ్ కేబుల్స్, అండర్ గ్రౌండ్ వరద నీటి కాలువలు, అండర్ గ్రౌండ్ తాగు నీటి సరఫరా ప్రాజెక్టులను ఎస్ టి పి లను అమలు చేసేందుకు నిపుణులచే డి.పి.ఆర్.లు సిద్ధమవుతున్నాయన్నారు

వరంగల్ నగరాభివృద్ధి శరవేగంగా దూసుకెళుతుందన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్, 15వ, ఆర్థిక సంఘం నిధులు, స్మార్ట్ సిటీ ఇతర ప్రభుత్వ నిధులతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్ లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, డివిజన్లలో అత్యవసర పనుల నిమిత్తం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. హన్మకొండ ప్రాంతంలో కీలకమైన నయీమ్ నగర్ నాలా విస్తరణ, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న వంతెనల విస్తరణ అభివృద్ధి పనులు ఇరిగేషన్, జి.డబ్ల్యు.ఎం.సి. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆరు నెలల్లోనే పూర్తి చేయడం అభినందనీయమన్నారు. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, ముందుకు తీసుకుపోవడంలో కృషి చేసారు. నయీమ్ నగర్ బ్రిడ్జి వేగవంతంగా పూర్తి కావడం వల్ల పాలకవర్గానికి మంచి పేరు లభించిందని తెలియజేశారు. వరంగల్ నగరం ముంపునకు గురికాకుండా ఉండడానికి గాను ముందస్తుగా ప్రణాళిక బద్ధంగా నాలాలు, అంతర్గత డ్రైనేజీలలో పూడికతీత పనులు చేపట్టడం వల్ల వరద నీరు సాఫీగా నగరం నుండి బయటకు వెళ్లాయి. ములుగు రోడ్ అజార హాస్పిటల్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయడం వల్ల వరంగల్ నగరంలోని పలు కాలనీలకు ముంపు ప్రమాదం తప్పింది. ఇదే స్ఫూర్తితో మిగిలిన వంతెనలు కూడా పూర్తి చేస్తామని తెలియజేశారు. వరంగల్ నగరం ముంపునకు గురి కాకుండా శాశ్వతంగా పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని అన్నారు. నగర సుందరీకరణలో భాగంగా 14 ముఖ్యమైన జంక్షన్లను సీతాకోక చిలుక, చెయ్యి, ఈఫిల్ టవర్, శంఖం తదితర వినూత్న థీమ్ లతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడం జరుగుతున్నదని, అందులో కొన్ని ఇటీవల ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మహిళలను వ్యాపార పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఆరు మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికే హన్మకొండ కలెక్టరేట్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, కాకతీయ యూనివర్సిటీ వద్ద ఇందిరా మహిళా క్యాంటీన్లను ప్రారంభించుకున్నామన్నారు. మరో 3 క్యాంటీన్లు బల్దియా ప్రధాన కార్యాలయం, కాజీపేట మున్సిపల్, కాశిబుగ్గ మున్సిపల్ కార్యాలయాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. దీనికి తోడుగా రెండో విడతలో మరో 8 ఇందిరా మహిళా క్యాంటీన్లను జి.డబ్ల్యూ.ఎం.సి. పరిధిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వరంగల్ మహానగరంలో ఇటీవల రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసినను బల్దియా ఆధ్వర్యంలో కమిషనర్ సారథ్యంలో అధికారులు, డి.ఆర్.ఎఫ్ ప్రత్యేక బృందాలను, మాన్ సూన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నగర ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరిగింది.వరద బాధితుల సహాయార్థం 25 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించడం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు భోజనం, అల్పాహారం, దుప్పట్లు, ఉచిత వైద్య శిబిరం తదితర వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుత ఎజెండాలో 15 ఆర్థిక సంఘం నిధులతో ముఖ్యమైన అభివృద్ధి పనులు ఆమోదించు కోవడం జరిగిందని, అదేవిధంగా ఇంటింటా చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా వాహనాలు కొనుగోలు చేయుటకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఇటీవల గణేష్ నిమజ్జన ఏర్పాట్లను గౌరవ కార్పొరేటర్లు, అధికారులందరి సహకారంతో విజయ వంతంగా పూర్తి చెయ్యడం జరిగిందని తెలిపారు. సద్దుల బతుకమ్మ దసరా ఉత్సవాల నిర్వహణ కోసం గతంలో మాదిరిగానే వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని,

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరం, కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, కొచ్చిన్ నగరాలలో స్మార్ట్ సిటీ పథకం కింద జరిగిన అభివృద్ధిని అధ్యయనం చేయడం కొరకు ఎక్స్ అఫిషియో సభ్యులు, గౌరవ కార్పొరేటర్లు, గౌరవ కమీషనర్, అధికారులతో స్టడిటూర్ ను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. వరంగల్ మహానగరాభివృద్ధికి సహకరిస్తున్న జిల్లాకు చెందిన అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖామాత్యులు తూర్పు శాసన సభ్యురాలు కొండ సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు, వరంగల్ మహానగర పాలక సంస్థ కార్పొరేటర్లకు, బల్దియా కమీషనర్ డాక్టర్ అశ్విని తానజీ వాఖడే, అధికారులకు ఈ కౌన్సిల్ సమావేశం ద్వారా మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వరంగల్ (పశ్చిమ)శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి

కార్పొరేషన్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని పార్టీల సభ్యులకు పార్టీలకు అతీతంగా మాట్లాడే అవకాశం కల్పించడం జరిగిందని వరంగల్ (పశ్చిమ)శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అట్టి అంశాలపై మంత్రివర్యుల ఆధ్వర్యంలో ఓపికగా వినడం జరిగిందని, తాము ఏమి చేయబోతున్నామనేది, స్పష్టంగా చెప్పడం జరిగిందని అందుకు అనుగుణంగానే కార్యక్రమాలు ఉంటాయని ఒక పద్ధతి ప్రకారంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఇన్ని రోజులు ఇష్టానుసారంగా నడిపిన కౌన్సిల్ ను మంత్రి శాసనసభ్యుల చొరవతో మార్గదర్శకంగా రూపొందించడం జరిగిందన్నారు. వివిధ పథకాల కింద కేటాయించిన నిధులు హైదరాబాదులో పేద కురుపే ఉన్నాయని మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని ఒప్పించి, అట్టి నిధులు తీసుకురావాల్సి ఉందని రాబోయే రోజుల్లో నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఊహించని విధంగా, నిధులు కేటాయించనున్నారని ఆశాభావం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి హైడ్రా తరహా విధానాలతో పాటు ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే అనేక విధానాలను కౌన్సిల్ సమావేశంలో చర్చించడం జరిగిందని, కాళోజీ కళా క్షేత్రం ప్రారంభోత్సవం రోజున ముఖ్యమంత్రి ప్రకటించనున్నారని శాసనసభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రేటర్ వరంగల్ నగరంలో ఉన్న సమస్యలపై కార్పొరేటర్లు, అధికారులతో తరచుగా సమావేశాలు నిర్వహించి, పరిష్కరించుకోవాలన్నారు. నగరంలో క్రమబద్ధంగా మంచినీటి సరఫరా అన్ని ప్రాంతాలకు జరిగేలా చర్యలు



తీసుకోవాలన్నారు.

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి

పరకాల అసెంబ్లీ నియోజకవర్గం లోని విలీన గ్రామాలలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఉపస్థితిలో ఉన్న బావులకు మోటార్లను బిగించి, ప్రత్యామ్నాయంగా మంచినీటి సరఫరా చేయవచ్చని తెలిపారు. వీధి దీపాలకు బల్బులు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, బతుకమ్మ నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.


## వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు

తూర్పు శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నయీమ్ నగర్ నాలా, బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేయడం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన నియోజక వర్గ పరిధిలోని జవహర్ నగర్ కాలనీ, ఇతర కాలనీలకు వరద ముప్పు తప్పిందని, ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేను, నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజవర్గంలోని ప్రధాన రహదారులైన ఖమ్మం రోడ్డు, కరీంనగర్ రోడ్ లపై సెంట్రల్ మీడియన్ ల ఏర్పాటుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. యువకులు చెడు వ్యసనాల వైపు మరల కుండా ఉండేందుకు, వారిని క్రీడల వైపు మళ్లించేందుకు ఇండోర్ స్టేడియాలను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. బల్దియాలో పారిశుద్ధ్య కార్మికుల కొరతను అధిగమించడానికి 250 మందిని త్వరలో నియమించుటకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పలువురు కార్పొరేటర్లు తమ వార్డులలో ఉన్న పలు సమస్యలు డ్రైనేజ్ రోడ్లు వీధి దీపాల ఏర్పాటు పారిశుద్ధ్యం, కుక్కల కోతుల నివారణ, పార్కుల నిర్వహణ తదితర సమస్యల గురించి మంత్రి, మేయర్ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. ఈ సమావేశంలో జీ డబ్ల్యుఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే, డిప్యూటీ మేయర్ రిజ్వాన శమీమ్ మసూద్, కార్పొరేటర్లు, బల్దియాలోని అన్ని వింగ్ విభాగాల అధికారులు, వైద్య ఆరోగ్య, ఎన్పీడీసీఎల్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులే

**- డి.ఆర్.డి.ఓ కౌసల్యదేవి, విజిలెన్స్ అధికారి పద్మనాభ రెడ్డి**



పర్వతగిరి, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఎంపిడిఓ మాలోతు శంకర్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిఆర్ డిఓ కౌసల్యాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి పద్మనాభ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులే అన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సుశీల్ కుమార్, ఈసి రాజు, ఎస్.ఆర్.పి చెన్నకేశవులు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.ి

# ఎంజీఎం ఆసుపత్రిలో సేవ సే సీఖేన్ - 2024

**- అనుభవాత్మక అభ్యాస కార్యక్రమం**




**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో సేవ సే సీఖేన్ – 2024 అనే అనుభవాత్మక అభ్యాస కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ యువజన వ్యవహారాల విభాగమైన మేరా యువ భారత్ సంస్థ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, అదనపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. సిహెచ్. మురళి (ఎండీ అనస్థీషియాలజీ) ఆధ్వర్యం వహిస్తున్నారు. మేరా యువ భారత్(మై భారత్) తరపున జిల్లా అధికారి అన్వేష్ చింతల ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం మై భారత్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 12 మంది అభ్యర్థులలో, చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీకి చెందిన 5 మంది విద్యార్థులు ఎంపిక చేయబడ్డారు. ఈ విద్యార్థులు 120 గంటల పాటు( 30 నుండి 60 రోజులు) జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత వీరికి ప్రత్యేక ధ్రువపత్రాలు అందజేయబడతాయి. ఈ అనుభవాత్మక అభ్యాస కార్యక్రమం ద్వారా యువతకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించడం, వారిలో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు వైద్య రంగంలో ప్రాయోగిక అనుభవాన్ని పొందడమే కాకుండా, సమాజ సేవలో తమ వంతు పాత్రను నిర్వహించే అవకాశం కూడా లభిస్తుంది.

# టొబాకో రహిత సమాజం కోసము 60 రోజుల అవగాహన సదస్సులు

**- డాక్టర్ కే. వెంకటరమణ డిఎంహెచ్ఓ వరంగల్**






**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 23,(జర్నలిస్ట్ వార్త):** టొబాకో రహిత గ్రామాలు కావాలని నేటి నుండి 60 రోజుల పాటు ప్రతి పాఠశాల, ప్రతి కళాశాలలో టొబాకోపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. వెంకటరమణ అన్నారు. టొబాకో నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల్ రావు, సిబ్బందిచే ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. టొబాకో వాడడం వలన పీల్చడం వలన వివిధ రకాలైన క్యాన్సర్ వ్యాధులు గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, చర్మ క్యాన్సర్ మొదలగు వాటికి గురి అయ్యి అనారోగ్యం పాలై, ఆర్థికంగా నష్టపోయి, సమాజ అభివృద్ధిలో పాలు పంచుకోకుండా, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. పొగాకు ఉత్పత్తులు లేకుండా ఉండాలంటే పొగాకును వాడకుండా ప్రజలలో చైతన్యం తేవాలని కోరారు. విద్యార్థులు పొగాకు ఉత్పత్తులపైన స్పందించి, అడిగిన ప్రశ్నలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. జిల్లా పొగాకు నియంత్రణ అధికారి తన టీం ద్వారా జన సమూహము ఉన్న వద్ద ఎవరైనా సిగరెట్లు తాగిన, పొగాకు ఉత్పత్తులు వాడిన వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నదన్నారు. అందువల్ల ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి, వాటిని వాడకుండా ఉండి, ఇతరులకు హాని కలిగించకుండా ఉండాలని కోరారు. డిప్యూటీ డెమో అనిల్ కుమార్ టొబాకో రహిత సమాజం కొరకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏవివి కళాశాల ప్రిన్సిపల్ భూజేందర్ రెడ్డి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎన్సిడి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్స్ ప్రకాశ్ రెడ్డి, సోమేశ్వర్ ,నర్మదా లక్ష్మి, పద్మ, రాజేష్ ఖన్నా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే కష్టపడి చదవాలి

**- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి**







రాయపర్తి, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే కష్టపడి చదవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాయపల్లి గ్రామం కస్తూర్బా గాంధీ వసతి గృహాన్ని అకస్మితకంగా తనిఖీ చేశారు. హాస్టల్లోన్ని తరగతి గదులు, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, సిజనల్ జ్వరాలు, తదితర అంశాలపై ఎమ్మెల్యే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వారికున్న వ్యక్తిగత అవసరాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం,కొన్ని నిత్యవసర వస్తువులు, కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వారి వినతులకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నానని చెప్పారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు, విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారులకు జాగ్రత్త చర్యలకు పలు సూచనలు చేశారు. ఇటీవల వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు, తెలంగాణ ప్రజా ప్రభుత్వం వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ కవిత, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, జినుగు రత్నాకర్ రెడ్డి, నంగునూరి అశోక్, ఉల్లెంగుల యాదగిరి, ఎండి ఉస్మాన్, చిర్ర మల్లయ్య,గుగులోత్ శ్రీనివాస్ నాయక్, ఎండి అఫ్రోజ్, పాల్వంచ కోటేశ్వర్, గుగులోతు యాకూబ్, ఎండి గౌస్ ఖాన్, గారే బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**






రాయపర్తి, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 83 మంది లబ్ధిదారులకు మంజూరైన 88, 09, 628 రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ, అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. అనంతరం అధికారుల సమక్షంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత హీ సే సేవ కార్యక్రమంలో బాగాంగా సెల్ఫీ పాయింట్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, సెల్ఫీ దిగారు. అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. నీటిని పొదుపుగా వాడాలని, ప్రతి ఇంటిలో ఇనుకుడు గుంతలు, మరుగుదొడ్లు ఉపయోగించాలన్నారు. నిలిచి ఉన్న నీటిపై కిరోసిన్, బ్లీచింగ్ పౌడర్ వేయాలని, ప్లాస్టిక్ ను వాడకుండా, సహజ వనరులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీవో జి కిషన్ నాయక్, ఎంపీఓ కూచన ప్రకాష్, మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం, తొర్రూరు బ్లాక్ అధ్యక్షులు హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, నంగునూరి అశోక్, ఉల్లెంగుల యాదగిరి, ఎండి ఉస్మాన్, చిర్ర మల్లయ్య, గుగులోత్ శ్రీనివాస్ నాయక్, ఎండి అఫ్రోజ్, పాల్వంచ కోటేశ్వర్, గుగులోతు యాకూబ్, ఎండి గౌస్ ఖాన్, గారే బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# కట్టుదిట్టంగా ఓటరు జాబితా సవరణ

**- సీఈఓ సుదర్శన్ రెడ్డి - వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష**




వరంగల్, సెప్టెంబర్ 24,(జర్నలిస్ట్ వార్త): ఎస్–ఎస్ఆర్–2025 లో భాగంగా నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కట్టుదిట్టంగా చేపడుతూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈ.ఆర్.ఓ నెట్ 2.0 తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీ.ఈ.ఓ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియ వేగవంతమయ్యిందని, వారం రోజుల వ్యవధిలోనే 55 శాతం నుండి 95 శాతానికి చేరుకుందని, జిల్లా కలెక్టర్లు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ లు, సూపర్వైజర్లను అభినందించారు. మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున గడువులోపు ఇంటింటి సర్వేను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు తప్పనిసరిగా ప్రతి ఇంటిని, తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పక సందర్శించాలని, తద్వారా ఓటరు జాబితాలో ఎలాంటి సాంకేతిక తప్పిదాలు చోటుచేసుకునేందుకు అవకాశం ఉండదని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఓటరు ముసాయిదా జాబితా వెలువరించడానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం కొనసాగుతున్న ప్రదేశాన్ని తెలియజేసేలా ఫోటోలను బి.ఎల్.ఓ యాప్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. అదేవిధంగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్ ఉన్న ఫారం 6, ఫారం 6 ఏ, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలన జరపాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు అన్ని పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళిన వారి వివరాలు క్షేత్రస్థాయిలో సేకరించి, ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు అనుగుణంగా నోటీసు జారీ చేసిన మీదట అలాంటి వారి పేర్లను జాబితా నుండి తొలగించాలని తెలిపారు. డెమోగ్రాఫికల్ సిమిలారిటీలు కలిగిన వాటిని జాబితా నుండి తొలగించేందుకు ఇంటింటి సర్వే కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని, దీనివల్ల ఎన్నికల సమయంలో హడావుడి పడాల్సిన అవసరం ఉండదని అన్నారు. కాగా, ఇంటింటి సర్వే లో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని , ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదని అన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలు, ఎస్ఎస్ఆర్ –2025 తో ముడిపడిన అంశాలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని అన్నారు. వారితో సమావేశాలు నిర్వహించే సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాల్సిందిగా నోటీసుల ద్వారా కోరాలని సీఈఓ సూచించారు. కొత్త ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించిన వివరాలను సకాలంలో సమర్పించాలని అన్నారు. మెదక్ –నిజామాబాద్ –ఆదిలాబాద్ –కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానాలతో పాటు, ఖమ్మం నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ స్థానాల పరిధిలోని ఓటర్ల పేర్ల నమోదు కోసం ఈ నెల 30న, పబ్లిక్ నోటీస్ జారీ చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, అదనపు కలెక్టర్లు జి.సంధ్య రాణి, ఆర్డీవో కృష్ణవేణి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

